

ప్రమాదాల్లో పలువురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వేరువేరుగా జరిగిన ప్రమాదాలలో నలుగురు వ్యక్తులు మృత్యువాతపడ్డారు.

- 8లో



వైఎస్సార్ హయాంలోనే..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలోనే ధూపదీప నైవేద్యం పథకం ప్రారంభమైందని షబ్బీర్ అలీ పేర్కొన్నారు.

- 9లో

గరిష్టం/కనిష్టం
34.7 /20.2

వాతావరణం

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

13 మంది ఎంపీడీవోల బదిలీ

సాక్షి, కామారెడ్డి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మూడేళ్లకుపైగా జిల్లాలో పనిచేస్తున్న అధికారులతోపాటు సొంత జిల్లాలో పనిచేస్తున్న అధికారులను బదిలీ చేస్తున్నారు. ఇప్పటికే తహసీల్దార్లు, ఆర్డీవోలకు స్థాన చలనం కల్పించగా.. తాజాగా ఎంపీడీవోలను బదిలీ చేశారు. జిల్లాలో 13 మంది ఎంపీడీవోలను పొరుగు జిల్లాలకు పంపించారు. టి.చిన్నారెడ్డి, కె.రవీశ్వర్‌గౌడ్, జి.వెంకటేశ్వర్, ఎ.బాలకృష్ణ, కె.నాగేశ్వర్, కె.లక్ష్మి, ఎం.సుబ్రహ్మణ్యం, ఎ.అనంతరావ్, బి.ఆనంద్, ఎం.సతీష్‌కుమార్, ఎస్.శంకర్, ఎన్.రఘు, వి.బాలకిషన్‌లను మెదక్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాలకు బదిలీ చేశారు. నిజామాబాద్ జిల్లాలో పనిచేస్తున్న పది మందిని కామారెడ్డి జిల్లాకు పంపిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

భిక్కనూరు యువకుడికి గ్రూప్‌-4లో 42వ ర్యాంకు



భిక్కనూరు : మండలకేంద్రానికి చెందిన బోయినిపల్లి ప్రణయ్‌సాయి గ్రూప్‌-4లో 42వ ర్యాంకు సాధించాడు. ప్రణయ్ గ్రూప్‌-1లో రెండుసార్లు ప్రిలిమ్స్ క్వాలిఫై అయ్యాడు. అతడి తండ్రి విష్ణువర్ధన్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా, తల్లి శ్రీవిద్య గృహిణి. తండ్రి, తాతయ్య సూచనలు, సలహాలను పాటిస్తూ ప్రిపేరై, గ్రూప్స్‌లో మంచి ఫలితాలు సాధించానని తెలిపారు.

అథ్లెటిక్స్‌లో పతకాలు



కామారెడ్డి అర్బన్ : జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. హైదరాబాద్‌లోని బాలయోగి స్టేడియంలో ఆదివారం వరకు నిర్వహించిన రాష్ట్ర, జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో బంగారు, రజత పతకాలు సాధించారని మాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.రంజిత్‌మోహన్, డి.నరేశ్ తెలిపారు. 30ఏళ్ల పైబడిన విభాగంలో చంద్రశేఖర్‌గౌడ్ (400 మీటర్ల పరుగు) బంగారు పతకం, నరేశ్ (హర్డిల్స్) రజత పతకం, సతీశ్ (షాట్‌పుట్) రజత పతకం సాధించారని, వారికి అభినందనలు తెలుపుతున్నామన్నారు.

గ్యాస్ లీకై భారీ పేలుడు

ధర్పల్లి: నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలోని మైలారంలో గల ఓ ఇంట్లో గ్యాస్ లీకై మంటలు అంటుకున్న ప్రమాదంలో వృద్ధ దంపతులు తీవ్రగాయాల పాలయ్యారు. పేలుడు దాటికి ఇల్లు ధ్వంసం కాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నరేండ్ల రాజన్న(69) అతని భార్య నరేండ్ల గంగు(53) ఒక చిన్న గదిలో నివాసం ఉంటున్నారు. ఆదివారం ఉదయం నిద్రలేచిన రాజన్న బీడీ వెలిగించడంతో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించి మంటలు చెలరేగాయి. దీంతో రాజన్నతో పాటు ఆయన భార్యకు మంటలు అంటుకున్నాయి. పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో తీవ్ర గాయాలయ్యాయి. అయితే శనివారం రాత్రి గ్యాస్ సిలిండర్ అయిపోవడంతో కొత్త సిలిండర్‌ను మార్చారు. ఇందులో నుంచి గ్యాస్ లీకై గదిలో వ్యాప్తించింది. పేలుడు ధాటికి ఇల్లు పాక్షికంగా దెబ్బతిని, శిథిలాలు చెల్లాచెదురుగా ఎగిరిపడ్డాయి. తీవ్ర గాయాలైన వృద్ధ దంపతులను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో భర్త రాజన్న పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా చేరుకొని స్థలాన్ని పరిశీలించారు. కొడుకు గంగారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు.



ఆస్పత్రి ఆవరణలో తిని పడేసిన ప్లేట్లు, వ్యర్థాలు



ఆస్పత్రిలో సంచరిస్తున్న ఎలుకలు



ధర్మాసుపత్రిలో ఎలుకల గోల

- రోగులను కరుస్తున్నా పట్టించుకోని అధికారులు
- గతంలో మార్చురీలో శవాలను పీక్కుతిన్న ఘటనలు
- తాజా ఘటనపై విచారణ జరిపిన టీవీవీపీ కమిషనర్



జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఐసీయూలో మెడిసిన్స్ టేబుల్‌పై సంచరిస్తున్న ఎలుకలు (ఫైల్)

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఎలుకలు బెంబేలెత్తిస్తున్నాయి. ఆస్పత్రిలో సంచరిస్తూ రోగులు, వైద్య సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఆస్పత్రి నిర్వహణను అధికారులు, సానిటేషన్ కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని, దీంతో తరచూ ఎలుక కాటు సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రిలో శనివారం చోటుచేసుకున్న ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులపై తీవ్రంగా మండిపడినట్లు తెలిసింది.

ఎలుక కొరుకుడు ఘటనలు..

■ నాలుగేళ్ల క్రితం మార్చురి గదిలో ఉన్న ఓ వ్యక్తి మృతదేహాన్ని ఎలుకలు కొరికేశాయి. నోరు, ముక్కు, చెవులు, చేతివేళ్లు, కాళ్లను ఎలుకలు పీక్కుతిన్నాయి. ఈ అంశంపై అప్పట్లో 'సాక్షి'లో ప్రచురితమైన కథనం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది.

■ 2022 ఏప్రిల్ 11వ తేదీన జిల్లా ఆస్పత్రిలోని ట్రామాకేర్, ఐసీయూ విభాగాలలో చికిత్స పొందుతున్న రోగులను ఎలుకలు గాయపరిచాయి. ఈ విషయాన్ని కూడా 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. తాజాగా ఇదే ఆస్పత్రిలో మళ్లీ శనివారం రాత్రి రోగులను ఎలుకలు కరిచాయి. హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన షేక్ ముజీబ్‌ను రక్తం వచ్చేలా గాయపరిచాయి. అదే రోజు మరో ఇద్దరు రోగులను సైతం కరిచాయి.

సానిటేషన్ నిర్వహణ గాలికి..

జిల్లా కేంద్ర ఆస్పత్రి భవనంలో 28 విభాగాలున్నాయి. దీంతోపాటు మెడికల్ కళాశాల సైతం ఇందులోనే ఏర్పాటు చేశారు. దీంతో భవనం ఇరుకుగా మారింది. వాహనాల పార్కింగ్‌కు స్థలం సరిపోవడం లేదు. రోగులు, వారి బంధువులు భోజనం చేయడానికి సరైన స్థలం లేదు. దీంతో ఆస్పత్రిలోని మంచాల వద్ద, మెట్లపై, ఎక్కడ పడితే అక్కడ భోజనాలు చేసి, మిగిలిన తినుబండరాలు, వ్యర్థాలను అక్కడే పడేస్తున్నారు. దీంతో ఎలుకలు ఆహారం కోసం బయటకు వచ్చి, ఆస్పత్రి అంతా కలియ తిరుగుతున్నాయి. ఆక్సిజన్ పైపుల గుండా సంచరిస్తూ ఏసీలను పాడు చేస్తున్నాయి. మంచాల వద్దకు వచ్చి రోగులను గాయపరుస్తున్నాయి. ఆస్పత్రి బయట ప్రాంతంలో, కిచెన్ షెడ్‌లో ఎక్కడ చూసినా ఎలుకల బొరియలే కనిపిస్తాయి. సానిటేషన్ నిర్వహణ సరిగా లేకపోవడంతో ఎలుకల స్వైర విహారానికి అడ్డుకట్ట పడడం లేదు. ఎలుకల కోసం గమ్ ప్యాడ్‌లు, బోనులను ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప, వాటి బెడద తప్పించడానికి సరైన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎలుకల నివారణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆస్పత్రిలో ఎలుకల బెడద లేకుండా చూస్తాం

- టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్



విచారణ చేస్తున్న కమిషనర్ అజయ్‌కుమార్

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఎలుకల బెడద లేకుండా చూస్తామని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఎలుకల దాడి ఘటనపై ఆయన ఆదివారం ఆస్పత్రిలో విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతో విచారణ జరిపి నివేదికలను ప్రభుత్వానికి అందజేశామన్నారు. ఆస్పత్రిలో వైద్య సేవల విషయంతో ఎలాంటి నిర్లక్ష్యం లేదన్నారు. గతంలో కూడా రెండుసార్లు ఎలుకలు వచ్చిన సంఘటనలను గుర్తు చేశారు. ఎలుకలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించామన్నారు. రోగులు, వారి బంధువులు ఆస్పత్రి ఆవరణలో ఎక్కడపడితే అక్కడ భోజనం చేసి వ్యర్థాలను పడేస్తుండడం, నిర్మాణ పనులు జరుగుతుండడంతో ఎలుకలు వస్తున్నాయన్నారు. ఎలుకలు రాకుండా గమ్‌ప్యాడ్స్, బోన్లు ఏర్పాటు చేశామన్నారు. మరింత విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం అయితే సానిటేషన్ కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనవెంట డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి తదితరులున్నారు.

పరామర్శించిన బర్రెలక్క

బర్రెలక్క అలియాస్ శిరీష ఆదివారం జిల్లా ఆస్పత్రిని సందర్శించి, ఎలుక కరిచిన రోగిని పరామర్శించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



వివరాలు తెలుసుకుంటున్న బర్రెలక్క

మరమ్మతులు చేయిస్తాం

భవన నిర్మాణ పనులు జరగడం, రోగులు, వారి బంధువులు ఎక్కడ పడితే అక్కడ భోజనాలు చేసి వ్యర్థాలను పడేస్తుండడంతో ఎలుకలు వస్తున్నాయి. ఎలుకలు రాకుండా చర్యలు తీసుకుంటాం. అవసరమైనచోట మరమ్మతులు చేయించి, ఎలుకలు రాకుండా చూస్తాం.

– విజయలక్ష్మి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, కామారెడ్డి

ఫుట్‌బాల్ చాంపియన్‌గా రామారెడ్డి జట్టు

మందమర్రిరూరల్: మంచిర్యాల జిల్లా మందమర్రిలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో నిర్వహించిన దివంగత ఏఆర్ డీఎస్పీ శశిధర్ మెమోరియల్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీ చాంపియన్‌గా రామారెడ్డి జట్టు నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కరీంనగర్, రామారెడ్డి జట్లు తలపడ్డాయి. హోరాహోరీగా జరిగిన మ్యాచ్ సెకండ్ ఆఫ్‌లో రామారెడ్డి జట్టు ఒక గోల్ చేసింది. మ్యాచ్ చివరి వరకు కరీంనగర్ జట్టు గోల్ చేయకపోవడంతో రామారెడ్డి విజేతగా నిలిచింది. జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి చేతుల మీదుగా విజేతకు రూ.20 వేల నగదు, షీల్డ్, రన్నరప్‌కు రూ.10 వేల నగదు, షీల్డ్ అందించారు.



ఒకేఒక్క 'నిఘానేత్రం'

ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని, నేరాల నియంత్రణతోపాటు దర్యాప్తులో సీసీ ఫుటేజీ కీలకమనే ప్రకటనలు ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే రైల్వే స్టేషన్లలో నిఘా కరువైంది. కామారెడ్డి రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో మొత్తం 17 స్టేషన్లు ఉండగా ఒకే ఒక్క సీసీ కెమెరా ఉండడం గమనార్హం.



- కామారెడ్డి రైల్వే పీఎస్ పరిధిలో సీసీ కెమెరాలు కరువు
- 17 స్టేషన్లకు ఒకటే కెమెరా..
- తరచూ చోరీలు, ఇతర ఘటనలు
- కేసుల దర్యాప్తులో ఆటంకాలు
- దృష్టి సారించని రైల్వేశాఖ

కామారెడ్డి క్రైం: మారుతున్న కాలానికి అనుగుణంగా నిఘా వ్యవస్థను పటిష్టం చేయడంలో రైల్వేశాఖ విఫలమవుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కామారెడ్డి రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో మొత్తం 17 రైల్వే స్టేషన్లు ఉండగా, ఒకే ఒక్క సీసీ కెమెరా ఉంది. అదీ.. కామారెడ్డి రైల్వే స్టేషన్‌లోని టికెట్ బుకింగ్ కౌంటర్‌వద్ద ఏర్పాటు చేశారు. దీంతో స్టేషన్ పరిసర ప్రాంతాలతోపాటు ప్లాట్‌ఫామ్‌లపై నిఘా కరువైంది. రైల్వేపోలీస్ స్టేషన్ పరిధిలోని మిగతా స్టేషన్లలో అసలే నిఘా లేకుండాపోయింది.

ఎక్కడ ఏం జరిగినా ఇక్కడినుంచి వెళ్లాల్సిందే..

కామారెడ్డి రైల్వే పీఎస్ పరిధిలో కామారెడ్డి, తలమడ్ల, భిక్కనూర్, తిప్పాపూర్, శాఖాపూర్, అక్కాపూర్, మిర్జాపల్లి, వడియారం, శ్రీనివాస్‌నగర్, మాసాయిపేట్, బ్రాహ్మణపల్లి, మనోహరాబాద్, పలట్ పోతారం రైల్వే స్టేషన్లు ఉన్నాయి. పలట్ పోతారం స్టేషన్‌ను ఇటీవలే రద్దు చేశారు. కొత్తగా కామారెడ్డి నుంచి మనోహరాబాద్ మీదుగా సిద్దిపేట లైన్‌ను కొద్ది రోజుల క్రితం ప్రారంభించారు. మనోహరాబాద్ నుంచి సిద్దిపేట దారిలో మరో నాలుగు రైల్వే స్టేషన్లు ఉంటాయి. మొత్తం మీద 17 స్టేషన్లు కామారెడ్డి రైల్వే పీఎస్ పరిధిలోకి వస్తున్నాయి. ఎక్కడ ఏ సంఘటన జరిగినా, ఫిర్యాదు వచ్చినా కామారెడ్డి రైల్వే పీఎస్ పోలీసులే వెళ్లి విచారణ చేపట్టాల్సి ఉంటుంది.

సీసీ కెమెరాలు లేక..

కామారెడ్డి మీదుగా రోజూ పదుల సంఖ్యలో రైళ్లు నడుస్తున్నాయి. వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. సీసీ కెమెరాలు లేకపోవడంతో కేసుల దర్యాప్తునకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఇటీవలే కామారెడ్డి రైల్వే స్టేషనలో గుర్తు తెలియని మహిళ రెండేళ్ల వయసున్న పాపను ప్లాట్‌ఫాంపై వదిలేసి వెళ్లింది. రైల్వే పోలీసులు పాపను ఐసీడీఎస్ అధికారులకు అప్పగించి విచారణ ప్రారంభించారు. సీసీ కెమెరాలు లేకపోవడంతో విచారణ ముందుకు సాగడం లేదు. ఇలాంటి కేసులు ఎన్నో ఉన్నాయి.

ప్రకటనకే పరిమితం..

రైల్వే స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు గతంలోనే వచ్చాయి. కామారెడ్డి రైల్వే స్టేషన్‌కు 30 కెమెరాలు మంజూరు చేయనున్నట్లు ఉన్నతాధికారులు మూడేళ్ల క్రితమే తెలిపారు. ఇప్పటికీ కెమెరాల ఊసే లేదని, ఉన్నతాధికారులు దృష్టి సారించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉన్నతాధికారులకు నివేదించాం

కామారెడ్డి స్టేషన్‌లో ఒకటే సీసీ కెమెరా ఉంది. అది కూడా టికెట్ బుకింగ్ కౌంటర్ దగ్గర. మిగతా చోట్ల ఎక్కడా లేవు. పీఎస్ పరిధిలోని స్టేషన్లలోనూ సీసీ కెమెరాలు లేవు. కెమెరాలు ఏర్పాటు చేస్తే నిఘా పటిష్టమవుతుంది. దీనిపై ఇదివరకే ఉన్నతాధికారులకు నివేదించాం. మంజూరైతే ఏర్పాటు చేయిస్తాం.

– తావూ నాయక్, రైల్వే ఎస్సై, కామారెడ్డి

డోర్ టు డోర్ సర్వీస్ చేస్తా

- సమస్యల పరిష్కారం కోసమే ఫిర్యాదుల పెట్టె'
- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి
- నియోజకవర్గంలో 120 బాక్స్‌ల ఏర్పాటు



చిన్న మల్లారెడ్డిలో ఫిర్యాదుల పెట్టెను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్

కామారెడ్డి టౌన్: ప్రజలు తమ సమస్యలను విన్నవించేందుకు క్యాంప్ కార్యాలయానికి వచ్చి ఇబ్బందులు పడొద్దని, డోర్ టు డోర్ సర్వీస్ చేస్తానని కామారెడ్డి ఎమ్మెల్యే కే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెలను ఎమ్మెల్యే ఆదివారం పలుచోట్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ సమస్య ఉన్నా కాగితంపై రాసి పెట్టెలో వేస్తే వారంలోగా పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమస్య న్యాయబద్ధంగా ఉండాలన్నారు. నియోజకవర్గంలో ప్రస్తుతానికి 120 చోట్ల ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేశామని, అవసరమైన చోట్ల మరిన్ని ఏర్పాటు చేస్తామన్నారు. స్వయంగా తానే ఫిర్యాదులను పరిశీలిస్తానని, న్యాయబద్ధమైన సమస్యను తక్షణమే పరిష్కరిస్తానన్నారు. ఫిర్యాదులు, సమస్యలపై క్యాంపు కార్యాలయం నుంచి ఫోన్లు వస్తాయని తెలిపారు. ఫిర్యాదుల పెట్టెను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పాఠాలు అర్థం కావడం లేదని..

- ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

కామారెడ్డి క్రైం: నీట్ కోసం సన్నద్ధమవుతున్న యువకుడు.. కోచింగ్‌లో పాఠాలు అర్థం కావడం లేదని మనస్తాపం చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. గాంధారి మండలం గండివేట్ గ్రామానికి చెందిన కృష్ణమూర్తి (19) ఇంటర్ పూర్తి చేసి వైద్య విద్యలో ప్రవేశం నిమిత్తం నీట్ కోసం హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకుంటున్నారు. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన కృష్ణమూర్తి.. ఈనెల 2 న హైదరాబాద్ వెళ్లడానికి కామారెడ్డి బస్టాండ్‌లో ఆగాడు. అక్కడినుంచి స్నేహితుడు రవికి వీడియో కాల్ చేసి తాను పురుగుల మందు తాగి చనిపోతున్నానని చెప్పాడు. రవి వెంటనే కృష్ణమూర్తి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. అందరూ కలిసి బస్టాండ్‌కు చేరుకుని గాలించినా అతడి ఆచూకీ లభించలేదు. జూబ్లీ బస్టాండ్‌లోని బస్సులలో వెతకగా ఓ బస్సులో అపస్మారక స్థితిలో కృష్ణమూర్తి కనిపించాడు. వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించాడు. పాఠాలు అర్థం కావడం లేదని బాధపడేవాడని మృతుడి కుటుంబ సభ్యులు, స్నేహితులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థుల తల్లిదండ్రుల ధర్నా

- బీబీపేట గురుకులంలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- దురుసుగా ప్రవర్తిస్తున్నాడని ప్రిన్సిపల్‌పై ఆగ్రహం



రోడ్డుపై బైఠాయించిన విద్యార్థుల తల్లిదండ్రులు

బీబీపేట: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకులం విద్యార్థుల తల్లిదండ్రులు రోడ్డెక్కారు. ప్రైవేట్ భవనంలో పాఠశాల, హాస్టల్ ఒకేచోట కొనసాగుతుండడంతో తమ పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. సుమారు గంట పాటు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 400 మంది విద్యార్థులు ఉన్న గురుకులంలో తరగతి, హాస్టల్ గదులు వేర్వేరుగా లేవని, కేవం 20మరుగుదొడ్లు ఉండడంతో పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని మండిపడ్డారు. ఉన్నతాధికారులు, నాయకులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన ఓ వ్యాపారి తన స్థలంలో సొంత నిధులతో భవనం నిర్మించి ఇస్తానని గ్రామ పంచాయతీలో తీర్మానం చేసినప్పటికీ.. ఇప్పటివరకు ఒక్క అడుగు ముందుకు పడలేదన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు వచ్చి రోడ్డుపై బైఠాయించిన వారిని సముదాయించారు. ఏదైనా ఉంటే ఫిర్యాదు చేయాలని కోరడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు.

ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలి



నెలకోసారి పిల్లలను చూడడానికి వస్తే ప్రిన్సిపల్ దురుసుగా ప్రవర్తిస్తున్నాడు. విద్యార్థులు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు చెబితే.. ఎక్కడ చెప్పుకున్నా ఏం జరగదు పో.. అంటూ వెటకారంగా మాట్లాడుతున్నారు. వెంటనే ప్రిన్సిపల్ లక్ష్మణ్‌పై చర్యలు తీసుకోవాలి.

– రవీందర్, విద్యార్థి తండ్రి

వేరే చోటుకు తరలించాలి



భవనం ఇరుకుగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే గురుకులాన్ని వేరేచోటుకి మార్చాలి. మరుగుదొడ్లు సరిగ్గా లేకపోవడంతో అనారోగ్యంబారినపడుతున్నారు. విద్యార్థులను ఆస్పత్రికి సైతం తీసుకుపోవడం లేదు.

– సత్యనారాయణ, విద్యార్థి తండ్రి

దురుసు ప్రవర్తన.. అసభ్యకర మాటలు

విద్యార్థుల కోసం వస్తే ప్రిన్సిపల్ లక్ష్మణ్ దురుసుగా ప్రవర్తిస్తున్నాడని, విద్యార్థులను సైతం విచక్షణ రహితంగా కొడుతున్నారని తల్లిదండ్రులు ఆరోపించారు. కొట్టిన విషయం తల్లిదండ్రులకు చెప్పొద్దని విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల కోసం హాస్టల్ వద్దకు వస్తే తమతో కూడా అసభ్యకరంగా మాట్లాడుతున్నారని, ప్రిన్సిపల్‌ను మార్చాలని వారు పట్టుబట్టారు.

'ఇంగ్లిష్ మాట్లాడేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి'

సాక్షి, కామారెడ్డి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తెలుగులో మాట్లాడినట్టే ఇంగ్లిష్‌లోనూ ధారాళంగా మాట్లాడేలా తీర్చిదిద్దాలని విల్ టు కెన్ సంస్థ డైరెక్టర్ రామేశ్వర్‌గౌడ్ ఉపాధ్యాయులకు సూచించారు. రాష్ట్ర పరిశోధన విద్యాసంస్థ సహకారంతో విల్ టు కెన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉచితంగా ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం కామారెడ్డి పట్టణంలోని కళాభారతిలో ఉపాధ్యాయులకు ఒక రోజు ఆఫ్‌లైన్‌లో తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రామేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణలో ఇప్పటివరకు 22 జిల్లాల్లో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు పూర్తయ్యాయన్నారు. తరగతుల నిర్వహణకు అవకాశం కల్పించిన ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి, ఏఎంవో, ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



రామేశ్వర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

క్లుప్తంగా

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. శనివారం నాటికి 2లక్షల 79వేల 666 మెట్రిక్ టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అగ్రిమెంట్ చెరుకు ప్రాధాన్యతను ఇస్తున్నామని ఆయన సూచించారు.

1వ తేదీ నుంచి టెన్త్ ప్రీఫైనల్స్

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : పదోతరగతి విద్యార్థులకు మార్చి 1వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 28 నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు ఉన్నందున 10వ తరగతి విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షలను మధ్యాహ్నం నిర్వహించనున్నారు. మార్చి-1న తెలుగు, 2న హిందీ, 4న ఇంగ్లిష్, 5వ గణితం, 6న భౌతిక శాస్త్రం,7న జీవశాస్త్రం, 11న సాంఘిక శాస్త్ర పరీక్షలను నిర్వహిస్తారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మార్చి 18 నుంచి టెన్త్ వార్షిక పరీక్షలు ప్రారంభమవుతాయి.

రేణుక ఎల్లమ్మగుడి నిర్మాణానికి భూమి పూజ



గాంధారి(ఎల్లారెడ్డి) : మండలంలోని గండివేట్ గ్రామంలో రేణుక ఎల్లమ్మ గుడి పునర్నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. గౌడ సంఘం సభ్యులు, గ్రామస్తులు కలిసి ప్రస్తుతమున్న గుడి స్థానంలో నూతన గుడిని నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలోగౌడ్ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనలో పోలీసుల పాత్ర కీలకం



కామారెడ్డి క్రైం: డ్రగ్స్ నిర్మూలనలో పోలీసుల పాత్ర కీలకమని ఎక్సైజ్ శాఖ కస్టమ్స్ డీఎస్పీ ఎ రంగనాథం పేర్కొన్నారు. పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం డ్రగ్స్ కేసుల పరిశోధన, నిందితుల విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలోని ఆయా పీఎస్‌ల అధికారులు, స్టేషన్ రైటర్లకు శిక్షణ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్‌డీపీఎస్ యాక్ట్‌లో ఎఫ్ఐఆర్ నుంచి మొదలుకుని నిందితులపై చార్జిషీట్ దాఖలు చేసేంత వరకు చేపట్టాల్సిన విధి విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాలను నిర్మూలించేందుకు చేస్తున్న కృషిలో పోలీస్ శాఖ పాత్ర ఎంతో ముఖ్యమైందన్నారు. అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, స్టేషన్ రైటర్‌లు పాల్గొన్నారు.

నవోదయ విద్యార్థులకు బంగారు భవిష్యత్తు

- సఫల ఆర్గనైజేషన్ సీఈవో, శాస్త్ర వేత్త డా. పైడి ఎల్లారెడ్డి


నవోదయలో వాటర్ ప్లాంట్‌కు భూమిపూజ చేస్తున్న శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి

నిజాంసాగర్(జుక్కల్): జవహర్ నవోదయలో విద్యను అభ్యసిస్తున్న గ్రామీణ ప్రాంత విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని సఫల ఆర్గనైజేషన్ సీఈవో, శాస్త్రవేత్త డా పైడి ఎల్లారెడ్డి అన్నారు. నవోదయ విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని, ప్రతి ఒక్క విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆదివారం నిజాంసాగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో సఫల ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సంస్థ సీఈవో, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ పైడి ఎల్లారెడ్డి చేతుల మీదుగా భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జపాన్ తరహాలో నవోదయ విద్యాలయం ఉందని ఇక్కడి మౌలిక వసతులు, విద్యను గ్రామీణ ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నవోదయ ప్రిన్సిపాల్ సత్యవతి నాయకులు రాజ్‌దాస్, మద్దెల నవీన్, గొట్టం నర్సింలు, గొర్గంటి రాములు, గైని రమేశ్, కాశీనాథ్ తదితరులు ఉన్నారు.

ఆర్ష గురుకులంలో ముగిసిన యోగా శిబిరం


యజ్ఞం నిర్వహిస్తున్న స్వామి బ్రహ్మానంద సరస్వతి

కామారెడ్డి అర్బన్ : మనిషి జీవితంలో సుఖం,శాంతి కోసం మహర్షి పతంజలి యోగా సాక్షాత్కరమే మార్గమని కామారెడ్డి పట్టణ పరిధిలోని పాతరాజంపేట శివారులోని ఆర్షగురుకుల స్వామి బ్రహ్మానంద సరస్వతి అన్నారు. ఆర్ష గురుకులం 41 యోగా శిబిరం ముగింపు కార్యక్రమం, స్వామి దయానంద సరస్వతి 200 జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం పంచకుండీ యాగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మానంద సరస్వతి మాట్లాడుతూ ఆర్యసమాజ స్థాపకులు స్వామి దయానంద సరస్వతి దేశానికి చేసిన సేవలను గుర్తుచేశారు. నేటి పరిస్థితుల్లో దయానందుని మార్గం ఎంతో అనుసరించతగినదన్నారు. ఈ కార్యక్రమంలో స్వామి ఆశుతోష్ (గుజరాత్), ఆచార్యసందీప్ దర్శనచార్య(హర్యానా), ఆచార్య వేదమిత్ర, సిద్దిరాములు ఆర్య, భాజన్న, సూర్యప్రకాష్ ఆర్యలు మాట్లాడారు.

సర్కార్ బడిలో మందుబాబుల హంగామా

రామారెడ్డి (ఎల్లారెడ్డి) : రామారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ఓ నిరుపేద యువతి పెళ్లి జరగగా పెళ్లికొచ్చిన వరుడి బంధువులు పాఠశాలలో మద్య సేవించి హంగామా చేశారు. దీంతో గ్రామ యువకులు, పెద్దమనుషులు వారిని వారించి అక్కడి నుంచి పంపించేశారు. ప్రాథమిక పాఠశాలలోని సరస్వతి విగ్రహం మద్యం సేవించడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెళ్లికి అనుమతి ఇచ్చిన హెచ్‌ఎంపై అసహనం వ్యక్తం చేశారు.

పాడి పరిశ్రమను అభివృద్ధి చేయాలి


అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని డెయిరీ టెక్నాలజీ విద్యార్థులు రైతులకు సూచించారు. ఆదివారం మండలంలోని సంతాయిపేట్ గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహిస్తూ పాల ఉత్పత్తిపై అవగాహన కల్పించారు. పాల ఉత్పత్తితో అధిక లాభాలు పొందవచ్చన్నారు. ప్రతి రైతు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి ఉమాపతి, రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ భాగ్యలక్ష్మి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై కళాజాత



భిక్కనూరు : మండల కేంద్రంతో పాటు పెద్దమల్లారెడ్డిలో ఎయిడ్స్ నివారణపై జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నివారణ విభాగం ఆధ్వర్యంలో కళాజాత బృందం ఆదివారం ప్రదర్శన నిర్వహించింది. శ్రీ సాయి కళాబృందం సభ్యులు ఎయిడ్స్ భూతం గురించి గుట్కా, సిగరెట్, పాన్ మసాలాతో ఇబ్బందులను వివరించారు. కళాబృందం సభ్యులు సొంటెం సాయిలు యాదవ్, కైరంకొండ సుజాత, అన్నెబోయిన శ్రీనివాస్ యాదవ్ తదితరులున్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు


మాట్లాడుతున్న సీఐ సంతోష్‌కుమార్

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసు నమోదు చేస్తామని సీఐ సంతోష్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ ధరించాలన్నారు.

సీఐకి సన్మానం



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : సదాశివనగర్ సర్కిల్ కార్యాలయానికి నూతనంగా నియామకమైన సీఐ సంతోష్‌కుమార్‌ను తిర్మన్‌పల్లి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, వీడీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



తాడ్వాయి: మండలంలోని కృష్ణాజివాడికి సమీపంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం వాహనాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. టాటా ఏస్ వాహనంలో 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను తరలిస్తుండగా కామారెడ్డి టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. వాహనం డ్రైవర్ భువనగిరి జిల్లాకు చెందిన బానసో నరేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి బియ్యంను సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

కొనసాగిన ఇంటర్ ప్రాక్టికల్స్

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలో ఆదివారం ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు కొనసాగాయి. ఉదయం జరిగిన పరీక్షలకు 193 విద్యార్థులకు గాను 180 మంది హాజరై 13 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 224 మంది విద్యార్థులకు గాను 204 మంది హాజరై, 20 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను జిల్లా ఇంటర్ అధికారి షేక్ సలాం తనిఖీ చేశారు.



గృహజ్యోతి దరఖాస్తుల పరిశీలన

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : 200 యూనిట్లలోపు విద్యుత్ కోసం గృహజ్యోతిలో భాగంగా వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతుంది. దరఖాస్తుల నమోదును త్వరితగతిన పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మండల కేంద్రంలోని వీడీసీ భవనం వద్ద, ఆయా గ్రామాల్లో జీపీల వద్ద విద్యుత్ శాఖ అధికారులు నమోదు ప్రక్రియను చేపడుతున్నారు. ఈనెల 15లోగా నమోదు చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ ధర్మారెడ్డి తెలిపారు.

మహమ్మద్ నగర్‌లో..

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో ఆదివారం ట్రాన్స్‌కో అధికారులు ఇంటింటికీ తిరుగుతూ గృహ జ్యోతి వివరాలను సేకరించారు. ప్రభుత్వ హామి మేరకు గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత కరెంట్‌కు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, కరెంట్ బిల్లు వివరాలు తీసుకుంటున్నామని ట్రాన్స్‌కో లైన్‌మెన్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లయ్యగారి. ఆకాష్, తోట. రాజు జేఎల్‌ఎమ్‌లు సాయి, రాజు తదితరులు ఉన్నారు.

షెడ్డు నిర్మాణానికి భూమిపూజ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని తాండూర్ గ్రామశివారులో త్రిలింగరామేశ్వరాలయం ఆవరణలో షెడ్డు నిర్మాణం కోసం ఆదివారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. మండలంలోని వెంకంపల్లి గ్రామానికి చెందిన 6టీవీ చైర్మన్ ఏలేటి సురేష్ రెడ్డి సహకారంతో ఆలయం ఆవరణలో షెడ్డు నిర్మాణం చేస్తున్నామని ఆలయకమిటీ చైర్మన్ దత్తు తెలిపారు.

ఉత్తమ ఓటరుకు సన్మానం

పెద్దకొడగల్(జుక్కల్) : తల్లి మృతదేహం ఇంట్లో ఉన్నప్పటికీ ఓటుపై ఉన్న గౌరవంతో ఓటేసేందుకు వెళ్లిన కాటేపల్లికి చెందిన నీరుడి అశోక్‌ను ఉత్తమ ఓటరుగా గుర్తించి ఆదివారం సన్మానించారు. కాటేపల్లి కాంగ్రెస్ నాయకులు మల్లప్ప పటేల్ మాట్లాడుతు అసెంబ్లీ పోలింగ్ రోజే నీరుడి అశోక్ తల్లి నీరుడి చంద్రవ్వకు పాము కాటేయగా మృతిచెందిగా, కొడుకు అశోక్, భార్య వసంత ఓటేసి వచ్చారని వారు పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం అశోక్‌ను గుర్తించాలన్నారు.

సెల్‌ఫోన్ల చోరీ నివారణకు పోలీసుల కాపలా



భిక్కనూరు : మండల కేంద్రంలో ఆదివారం జరిగిన అంగడిలో సెల్‌ఫోన్‌ల చోరీ జరగకుండా భిక్కనూరు ఎస్సై సాయికుమార్ పలు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ఆయన అంగడిలో పలుచోట్ల పోలీసులను కాపలా పెట్టారు. అనుమానితుల వివరాలు నమోదు చేసుకున్నారు. దీంతో ఆదివారం అంగడిలో సెల్‌ఫోన్లు చోరీ కాలేదు. సెల్‌ఫోన్‌ను ఇంటివద్ద పెట్టి వస్తే మంచిదని ఎస్సై సూచించారు.

దీన్‌దయాల్‌కు ఘననివాళి

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో పండిత్ దీన్ దయాల్ దివాస్‌ను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో దీన్ దయాల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బిజేపీ మండల పార్టీ అధ్యక్షుడు దత్తురాం, మహారాజుల మురళి, రాంచందర్, బొల్లారం సాయిలు, లక్ష్మన్ నాయక్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీతో సెల్ఫీ కోసం పోటీ



నిజామాబాద్ సిటీ: నగరంలోని ఖిల్లా రామాలయాన్ని ఆదివారం ఎంపీ ధర్మపురి అర్వింద్ సందర్శించారు. దీంతో అక్కడి భక్తులు ఎంపీతో సెల్ఫీ ఫోటో దిగుతామని కోరగా, ఆయన వారి ఫోన్ తీసుకుని సెల్ఫీ ఫోటో తీయటంతో హర్షం వ్యక్తం చేశారు.

నవ్యకు కన్నీటి వీడ్కోలు

- భార్య మృతదేహాన్ని కడసారి చూసేందుకు అంబులెన్స్‌లో వచ్చిన భర్త

భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నవ్య అంత్యక్రియలను భిక్కనూరులో ఆదివారం నిర్వహించారు. బైక్‌పై బయలుదేరిన దంపతులు స్వామిగౌడ్, నవ్యలను కారు ఢీకొనడంతో నవ్య అక్కడికక్కడే మృతిచెందగా స్వామిగౌడ్ తీవ్ర గాయాలై హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న విషయం విధితమే. ఆదివారం పోస్టుమార్టం అనంతరం భిక్కనూరులో నవ్య అంత్యక్రియలను నిర్వహించారు. బంధువులు, వివిధ పార్టీల నేతలు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో అంత్యక్రియల్లో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. నవ్య భర్త స్వామిగౌడ్ అంత్యక్రియల్లో పాల్గొంటానని ఒత్తిడి తెచ్చినప్పటికీ వైద్యులు వారించారు. అయినా ఆయన పెద్ద ఎత్తున రోధించడంతో బంధువులు అంబులెన్స్‌లో ఆయనను భిక్కనూరుకు తీసుకవచ్చారు. భార్య మృతదేహంను చూసి ఆయన తీవ్రంగా రోధించాడు. నవ్యకు కుమారుడు కార్తీక్‌గౌడ్ దహన సంస్కారాలను నిర్వహించాడు.

దళిత మహిళపై దాడి కేసులో మరో నలుగురి అరెస్ట్

కామారెడ్డి క్రైం: దళిత మహిళపై అమానుషంగా దాడి చేసిన ఘటన ఇటీవల రామారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసిన విషయం తెలిసిందే. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు ఇప్పటికే ఐదుగురిని రిమాండ్‌కు తరలించారు. నరేష్ అనే వ్యక్తి మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడని తెలుసుకుని మొదటి భార్య, ఆమె బంధువులు వారం రోజుల క్రితం రామారెడ్డిలోని ఓ ఇంటిపై దాడి చేసి వారిద్దరిపై దాడికి పాల్పడ్డారు. దళిత మహిళను నిర్బంధించి, బెదిరించిన ఈ కేసులో ఇదివరకే అయిదుగురు నిందితులను అరెస్టు చేసి, విచారణ జరిపారు. ఈక్రమంలో మరో నలుగురు నిందితులను ఆదివారం అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు కామారెడ్డి డీఎస్పీ ప్రకాష్ తెలిపారు. ఈ కేసులో ఇప్పటి వరకు మొత్తం తొమ్మిది మందిని రిమాండ్ చేశామన్నారు. కేసు విచారణ ఇంకా కొనసాగుతుందన్నారు. ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందో తెలుసుకుని తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

క్రైం కార్నర్

ఇసుక ట్రాక్టర్ పట్టివేత




రుద్రూర్: పోతంగల్ మండల శివారులో నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. మహారాష్ట్ర సరిహద్దులో నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తురన్న సమాచారం మేరకు కోటగిరి పోలీసులు నిఘా వేసి తెల్లవారు జామున ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్ తరలించారు. తదుపరి చర్యల కోసం అధికారులకు సమాచారం అందించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

ఇసుక లారీ సీజ్

ఆర్మూర్‌టౌన్: ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని ఆదివారం జిల్లా మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా మైనింగ్ అధికారి టెక్నికల్ అసిస్టెంట్ నాగేశ్వర్ ఘటన స్థలానికి చేరుకొని లారీలోని ఇసుకకు అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీని సీజ్ చేశారు. అనంతరం లారీని ఆర్మూర్ ఆర్టీసీ డిపోలో ఉంచారు.

బైక్ అదుపుతప్పి కానిస్టేబుల్‌కు గాయాలు



కామారెడ్డి క్రైం: బైక్ అదుపుతప్పి కిందపడిపోయిన ఘటనలో 7వ బెటాలియన్‌కు చెందిన ఓ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. పట్టణంలోని వడ్లగల్లీకి చెందిన కార్తీక్ 7వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం అతడు బుల్లెట్ వాహనంపై వెళ్తుండగా, దేవునిపల్లి ప్రధాన రహదారిపై బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. అతడికి తీవ్ర గాయాలు కాగా, స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడ నుంచి హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. ఘటనా స్థలాన్ని దేవునిపల్లి పోలీసులు పరిశీలించి విచారణ జరిపారు.

ఇందల్వాయి మండలంలో ఇద్దరికి..

ఇందల్వాయి: మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు స్థానికులు, 108 సిబ్బంది తెలిపారు. మండలంలోని సిర్నాపల్లి గ్రామానికి చెందిన తలారి శ్రీనివాస్, గోప్న బాలరాజు బైక్‌పై వెళుతుండగా అన్సాన్‌పల్లి శివారులో అదుపుతప్పి చెట్టును ఢీకొన్నారు. ఈఘటనలో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. గోప్న బాలరాజు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి


ఘటన స్థలంలో క్షతగాత్రులు

బాన్సువాడ రూరల్: మండలంలోని సోమేశ్వర్ శివారులో బాన్సువాడ-బోధన్ ప్రధాన రహదారిపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. సిద్దిపేట్ జిల్లా చిన్నకోడూరు మండలం గోనేపల్లి గ్రామానికి చెందిన వంగ భాను (25) బైక్‌పై బాన్సువాడ వైపు వస్తున్నాడు. సోమేశ్వర్ గ్రామానికి చెందిన విశాల్ బైక్‌పై బోధన్‌కు బయలుదేరగా, సోమేశ్వర్ శివారులో ఇరువురి బైక్‌లు ఎదురెదురు వచ్చి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వంగ భాను తీవ్రంగా గాయపడగా, స్థానికులు నిజాబాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మృతిచెందాడు విశాల్ గాయాలు కాగా ప్రాథమిక చికిత్స అనంతరం నిజామాబాద్ తరలించారు. తమకు సమాచారం అందగానే క్షతగాత్రులను 100 వాహనంలో బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించామని సీఐ కృష్ణ తెలిపారు. ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. న్నారు.

ఇందల్వాయి మండలంలో..

ఇందల్వాయి: మండలంలోని ఇందల్వాయి- ధర్పల్లి రోడ్డుపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వివరాలు ఇలా.. ఇందల్వాయి మండలం నల్లవెల్లి గ్రామానికి చెందిన గంగదాసు(42) ఆదివారం ధర్పల్లి మండలం సీతాయిపేట గ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. అన్సాన్‌పల్లి వద్ద అతడి బైక్‌ను ఇందల్వాయి వైపు వస్తున్న బైక్ ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగాదాసు ఘటనాస్థలంలోనే మృతి చెందగా, మరో బైక్‌పై ఉన్న ఆర్మూర్‌ప్రాంత వాసులకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నాడు.

గాంధారి మండలంలో..


కడెం విక్రంగౌడ్(ఫైల్)

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలు ఇలా.. గాంధారికి చెందిన కుమ్మరి లింగమేశ్వర్ శనివారం రాత్రి తన పుట్టినరోజును స్నేహితులు కడెం విక్రంగౌడ్(19), సునుగరం సందీప్‌తో కలిసి గ్రామ శివారులో జరుపుకున్నారు. అనంతరం వారు ఒకే బైక్‌పై ఇంటికి తిరిగి వస్తుండగ స్థానిక జీపీ కార్యాలయం వద్ద డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ఘటనలో బైక్ వెనక కూర్చున్న విక్రంగౌడ్ కింద పడిపోగ, తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మధ్యలో కూర్చున లింగమేశ్వర్‌కు స్వల్ప గాయాలు కాగా, సందీప్ క్షేమంగా ఉన్నాడు. మృతుడి తండ్రి నారాగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కరెంట్ షాక్‌తో రైతు..


బాబురావు (ఫైల్)

సిరికొండ: ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై రమేష్, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన కంచెట్టి బాబురావు(43) ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. పొలంలో మోటారు బంద్ ఉండటంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వచ్చి, మరమ్మతులు చేయసాగాడు. ట్రాన్స్‌ఫార్మర్‌ను బంద్ చేశాననుకొని, గద్దె పైకి ఎక్కగా ఒక ఫ్యూజ్ కనెక్షన్ నేరుగా ఉండటంతో అతడు విద్యుత్ షాక్‌కు గురై, కింద పడిపోయాడు. స్థానికులు అతడిని గమనించి అంబులెన్స్‌లో జిల్లాకేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి తల్లి మల్లవ్వ, భార్య లక్ష్మి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్‌లో ముగ్గురిపై కేసు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలకేంద్రంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన డ్రంకన్‌డ్రైవ్ తనిఖీల్లో ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. వారి వాహనాలను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపవద్దని వాహనదారులకు సూచించారు.

యువతి అదృశ్యం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన మన్నె అనిత (24) యువతి అదృశ్యమైనట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. ఈ నెల 10న అనిత కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేసి ఇంట్లో పడుకుంది. మరుసటిరోజు ఉదయం ఇంట్లో ఆమె కనబడకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. బొల్లారం గ్రామానికి చెందిన కొరబోయిన హరీష్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ ఆమె సోదరుడు ప్రవీణ్‌కుమార్ నాగిరెడ్డిపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్‌కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.